భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
BHARATIYA JANATA PARTY
Telangana

Dr. Shyamaprasad Mukherjee Bhavan
Opp: Exhibition Grounds
Nampally, Hyderabad-500 001.

10-09-2018

# పత్రికా ప్రకటన

సార్వత్రిక ఎన్నికలతో పాటు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఛరిష్మా ముందు తాను కొట్టుకుపోవడం ఖాయమని భావించి సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు తెరలేపారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రగతి చక్రం ఆగకుండా ఉండేందుకే ముందస్తు అని కేసీఆర్ అంటున్నారని.. అసలు రాష్ట్రంలో ప్రగతి చక్రం ఎక్కడుందని ప్రశ్నించారు. కేసీఆర్‌ను ముందస్తుగానే ఇంటికి పంపేందుకు ప్రజలు కూడా సిద్ధమయ్యారని స్పష్టం చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ పర్యటనలో భాగంగా డా॥ లక్ష్మన్ బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అధికారిక టీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, టీడీపీ, ఎంఐఎం తదితర పార్టీలపై విమర్శలు గుప్పించారు.

“ఒకే దేశం - ఒకే ఎన్నికలు” నినాదంతో ప్రజలపై భారం పడకుండా, అభివృద్ధికి అవరోధం కాకుండా నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలకు పిలుపునిస్తే... దానికి మొదటగా స్పందించి, రాతపూర్వకంగా ఆమోదం తెలిపిన కేసీఆర్, అందుకు విరుద్ధంగా ఇప్పుడెందుకు యూ-టర్న్ తీసుకున్నారో ఇంతవరకు స్పష్టం చేయలేదన్నారు. ముందస్తు పేరుతో 105 మంది అభ్యర్థులను ప్రకటించి.., అభివృద్ధి, సంక్షేమాన్ని అటకెక్కించి.., రాష్ట్ర రాజకీయాల్లో అనిశ్చితికి కేసీఆర్ కారణమయ్యారని దుయ్యబట్టారు. తెలంగాణ కోసం తాము త్యాగాలు చేశామని కేసీఆర్ రాగాలు తీయడాన్ని తప్పుబట్టారు. త్యాగాలు చేసింది విద్యార్థులు, యువత, ప్రజలయితే.. ద్రోహులకు తెలంగాణ తొలి ప్రభుత్వంలో చోటు కల్పించి కేసీఆర్ అమరవీరులను అవమానించారని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ ఎన్నికల ప్రణాళిక అమలులో పూర్తిగా విఫలమయ్యారని.. యువతకు ఉద్యోగాలివ్వలేదని, పేదలకు ఇండ్లు కట్టించలేదని, కేజీ టు పీజీ విద్య అమలుకాలేదని.., చివరికి జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను సైతం తుంగలో తొక్కారని డా॥ లక్ష్మన్ విరుచుకుపడ్డారు.

టీఆర్ఎస్‌కు ప్రజల్లో వ్యతిరేకత వస్తుండడంతో తామే ప్రత్యామ్నాయం అని కాంగ్రెస్ బయలుదేరిందని, పదేళ్ల కాంగ్రెస్ అవినీతి, అక్రమాల పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని అన్నారు. ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ బూటకపు వాగ్దానాలు చేస్తుందని... కానీ కాంగ్రెస్ ఆటలు, డ్రామాలు, విన్యాసాలను ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూదొందేనని... ఎవరు అధికారంలోకి వచ్చినా ఎంఐఎం అజెండా అమలు చేయడమే వాటి పని అని అన్నారు. కర్ణాటకలో కుమారస్వామి సీఎం అయినట్టు తెలంగాణలో ఎంఐఎం అభ్యర్థి సీఎం అవుతారని ఆ పార్టీ నాయకులు వ్యాఖ్యానించడం కాంగ్రెస్, టీఆర్ఎస్ సంతుష్టీకరణ రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. కాంగ్రెస్ నిర్వాకంతోనే గల్లీ పార్టీగా ఉన్న మజ్లిస్ దిల్లీ పార్టీగా మారిందని మండిపడ్డారు. మతోన్మాద మజ్లిస్‌కు బుద్ధి చెప్పాలన్నా, కర్రు కాల్చి వాత పెట్టాలన్నా అది బిజెపితోనే సాధ్యమని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి పాటుపడేది బిజెపి మాత్రమే అని, చారిత్రాత్మక బీసీ వర్గీకరణ, బీసీ కమిషన్ రాజ్యాంగబద్ధత, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టపర్చడం లాంటి అనేక చర్యలు మోదీ ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలో మార్పు బిజెపితోనే సాధ్యమని, ప్రధాని మోదీ పాలనపై, బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా నాయకత్వంపై ప్రజల్లో నమ్మకముందని డా॥ లక్ష్మన్ స్పష్టం చేశారు.

పెట్రో ధరలు, ద్రవ్యోల్బణం పెరిగాయంటూ కాంగ్రెస్ భారత్ బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే పెట్రో, నిత్యావసర వస్తువుల ధరలు ఎక్కువగా ఉన్నాయని.. నేటి ధరలను అప్పటి ధరలతో పోల్చి చూసుకోవాలని ఆ పార్టీ నాయకులకు హితువు పలికారు. పన్ను కట్టేవారికి ఊరటనిస్తూ మోదీ ప్రభుత్వం

అనేక చర్యలు చేపట్టిందని, ఫలితంగా కేంద్రం రూ.98,715 కోట్ల మేరకు ఆదాయాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం నోట్లరద్దు, జీఎస్టీ లాంటి అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టిందని, ఫలితంగా నల్లధనానికి అడ్డుకట్ట పడి, పన్నాదాయం పెరిగిందన్నారు. మోదీ అధికారంలోకి రాకముందు దేశంలో 3.8 కోట్ల మంది పన్ను కడితే.. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపయ్యిందన్నారు. 'ఒకే దేశం - ఒకే పన్ను' నినాదంతో జీఎస్టీని ప్రవేశపెట్టామన్నారు. 'ఒకే దేశం - ఒకే గ్రిడ్' నినాదంతో దేశవ్యాప్తంగా ఒకే విద్యుత్ గ్రిడ్ తీసుకొచ్చామన్నారు. ఫలితంగా తెలంగాణలో 24 గంటల కరెంటు సాధ్యమైందని తెలిపారు. అదేవిధంగా ఇప్పుడు 'ఒకే దేశం - ఒకే ఎన్నికలు' నినాదంతో జమిలి ఎన్నికలకు పిలుపునిస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ తెలుగు ఆత్మగౌరవం పేరుతో నాడు ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపిస్తే.. ఇప్పుడు చంద్రబాబు నాయుడు అదే కాంగ్రెస్‌తో చేతులు కలిపి.. ఎన్టీఆర్ ఆత్మ క్షోభించేలా చేశారన్నారు. ఇది చంద్రబాబు అవకాశవాద రాజకీయానికి పరాకాష్టగా అభివర్ణించారు. ఉద్యమం సమయంలో రెండు కళ్ల సిద్ధాంతం అన్న బాబు ఇప్పుడు రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని ఎద్దేవా చేశారు. అడుగడుగునా తెలంగాణ అభివృద్ధికి అడ్డం తగులుతూ, తెలంగాణ వ్యతిరేక చర్యలు చేపడుతూ.. ఇప్పుడు తెలంగాణకు టీడీపీ చారిత్రక అవసరం అనడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం కోసం, ఓటుబ్యాంకు కోసం సిద్ధాంతాలను పక్కకుపెట్టి పార్టీలు చేతులు కలపడాన్ని ప్రజలు ఆమోదించరన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు అన్ని పార్టీలకు అధికారం ఇచ్చారని... నీతి, నిజాయితీలకు మారుపేరైన బిజెపికి ఈ సారి అవకాశం ఇవ్వాలని డా॥ లక్ష్మణ్ ప్రజలను అభ్యర్థించారు.

టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ, ఎంఐఎం తదితర పక్షాలను ప్రజల మధ్య ఎండగట్టేందుకు బిజెపి ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15న మహబూబ్‌నగర్‌లో 'మార్పు కోసం బిజెపి శంఖారావం' నిర్వహిస్తున్నామని, బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా ఈ బహిరంగసభలో శ్రేణులను దిశానిర్దేశం చేస్తారన్నారు. మొత్తం 50కు పైగా సభలు నిర్వహిస్తామని, ఈ సభలకు ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు వస్తారని తెలిపారు. "గడప గడపకూ బిజెపి - ఇంటింటికి మోదీ", "అజేయ భారత్ - అటల్ భాజపా" నినాదాలతో ప్రజల వద్దకు వెళ్తామని డా॥ లక్ష్మణ్ స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో భాగంగా డా॥ లక్ష్మణ్ మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "మార్పు కోసం బిజెపి శంఖారావం" బహిరంగ సభ సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల శక్తి కేంద్రాల ఇంచార్జీలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 15న మహబూబ్‌నగర్ ఎం.వి.ఎస్ కాలేజ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి డా॥ లక్ష్మణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో పని చేస్తే రానున్న ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయమని ధీమాగా చెప్పారు.

**కార్యాలయ కార్యదర్శి**